క్లుప్తంగా

175 స్థానాల్లోనూ గెలుపు ఖాయం

–నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం వాకాడులోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. జగనన్న చెప్పిన విధంగానే వైనాట్ 175 సాధించే విధంగానే తమ పార్టీ అడుగులు వేస్తోందన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉండాలన్న ఉద్దేశంతో 26 నుంచి ఆంధ్రప్రదేశ్‌కు 'జగనన్నే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం చేపట్టామని నేదురుమల్లి తెలిపారు. వెంకటగిరి పోలేరమ్మ జాతర విజయానికి సహకరించిన గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

సంప్రదాయబద్ధంగా కలశ స్థాపన



సాయిసత్సంగ నిలయంలో ప్రతిష్ఠించిన కలశాలు

గూడూరురూరల్: దసరా వేడుకలను పురస్కరించుకుని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గూడూరు పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం కలశ స్థాపన కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. విఘ్నేశ్వరపురం బావి వద్ద కలశానికి పూజలు నిర్వహించి అక్కడి నుంచి మంగళవాయిద్యాలతో కలశాన్ని తీసుకొచ్చి దేవస్థానంలో ప్రతిష్ఠించారు. తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు, అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించనున్నారు. అదేవిధంగా పటేల్ వీధిలోని సాయిసత్సంగ నిలయంలో విజయ దుర్గ అమ్మవారి ఉప పీఠంలో ఆదివారం దేవీ శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని రాజరాజేశ్వరి, గంగమ్మ ఆలయం, నారాయణమ్మ పేరంటాళ్లు, మహాలక్ష్మమ్మ, ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజులస్వామి దేవస్థానంలో కలశ స్థాపన కార్యక్రమాలను నిర్వహించారు.

గాయపడ్డ వృద్ధురాలు మృతి

నాయుడుపేటటౌన్: ప్రమాదవశాత్తు నైటీకి మంటలు అంటుకుని ఎన్. చిన్నమ్మ (80)అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. ఆమె నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీకి చెందిన చిన్నమ్మ శనివారం సాయంత్రం ఇంటి వద్ద పొయ్యిపై వేడి నీళ్లు పెట్టుకుంది. పొయ్యివద్ద కూర్చొని ఉండగా మంటలు చిన్నమ్మ నైటీకి అంటుకుని తీవ్రంగా గాయపడింది. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నమ్మ ఆదివారం మృతిచెందింది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



జగదీష్ (ఫైల్)

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట జాతీయ రహదారిపై ఎంఆర్ గ్రాండ్ సమీపంలోని రోడ్డు పక్కన అనుమానాస్పద స్థితిలో ఓ మృతదేహాన్ని ఆదివారం పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ బ్రహ్మానాయుడు వివరాల మేరకు.. పట్టణంలోని గాంధ్ల వీధి ప్రాంతానికి చెందిన నెల్లూరు జగదీష్ (32) అనే వ్యక్తి బంధువులతో కలిసి శనివారం రాత్రి ఓ కార్యక్రమానికి బయటకు వెళ్లాడు. తర్వాత ఇంటికి తిరిగి రాలేదు. ఆదివారం ఓ వ్యక్తిని గొంతు కోసి హత్య చేసి రోడ్డు పక్కనే పడేశారని పోలీసుకు సమాచారం అందింది. ఘటన స్థలానికి వెళ్లి ఎస్‌ఐ సిబ్బందితో మృతదేహాన్ని పరిశీలించగా జగదీష్‌ను కత్తితో గొంతుకోసినట్లు గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మేలు



మాట్లాడుతున్న తులసీరామ్

రాపూరు: దసరా సెలవుల్లో గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మేలు జరుగుతుందని రాపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు తులసీరామ్ పేర్కొన్నారు. రాపూరు గ్రంథాలయంలో ఆదివారం నుంచి దసరా సెలవుల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ శిబిరాలను ప్రారంభించారు. గ్రంథాలయ అధికారిణి ధనమ్మ, సిబ్బంది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

వెంకటగిరిరూరల్: దేవి శరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఆదివారం ప్రత్యేక అలంకరణలో కొలువుదీరారు. ఇందులోభాగంగా పట్టణంలోని కర్ణమ్మవీధిలో హరిహర క్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో తొలిరోజు వేంకటేశ్వర స్వామి మత్స్యావతారం, కాత్యాయని అమ్మవారు అర్ధనారీశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వెలమపాళెంలోని శ్రీ మందనాచారమ్మ దేవస్థానంలో అమ్మవారు పార్వతీ అలంకారం, కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు పద్మావతీ అలంకరణలో దర్శనమిచ్చారు.

సైదాపురం: స్థానిక శ్రీబాలాత్రిపుర సుందరిదేవి ఆలయంలో ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బాలాత్రిపురసుందరి దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. శ్రీచక్రానికి పన్నీరు అభిషేకం చేశారు. అమ్మవారికి నక్షత్రహారతి ఇచ్చారు. ఈసందర్భంగా అమ్మవారి మాలను భక్తులు ధరించారు.

మహాకాళి అలంకరణలో..

కోట: గ్రామదేవత కోటమ్మ దేవస్థానంలో శరన్నవరాత్రి వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు మహాకాళి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: కలవకొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మి అమ్మవారు ఆదివారం బాలాత్రిపురసుందరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా గ్రామానికి చెందిన బూదరునల్లయ్య, కోటమ్మ దంపతులు వ్యవహరించారు. తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి అమ్మవారిగా దర్శనమిచ్చారు.



వెంకటగిరి: అర్ధనారీశ్వరి అలంకరణలో కాత్యాయని..

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్: శరన్నవరాత్రి వేడుకలను ఆదివారం నుంచి మండలంలోని ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. గ్రామదేవత పోలేరమ్మ ఆలయ కమిటీ సభ్యులు, భక్తులతో కలిసి స్వర్ణముఖి నది తీరం నుంచి కలశ సోధకంను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకాలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. రాత్రి పోలేరమ్మ పార్వతీ దేవి అలంకారంలో, స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వరి దేవి, బాలాత్రిపురసుందరి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.



పద్మావతిగా కన్యకాపరమేశ్వరి..

చెంగాళమ్మ ఆలయంలో..

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. కాళంగి జలాలను తీసుకొచ్చి కలశాల్లో పోసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఆలయ ఈఓ ఆళ్ల శ్రీనివాసులు రెడ్డి గణపతి పూజ, కలశ పూజ చేశారు. అనంతరం అఖండ జ్యోతిని వెలిగించి అమ్మవారి చెంత ఉంచారు. అనంతరం ఆలయంలో చండీయాగం నిర్వహించారు. బీరక రాంబాబు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

చిట్టమూరులో..

చిట్టమూరు: మల్లాం గ్రామంలోని కామాక్షీదేవి సమేత మార్కండేశ్వర స్వామి, ఆరూరు గ్రామ దేవత ఎల్లమ్మ ఆలయాల్లో ఆదివారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మల్లాంలోని కామాక్షీదేవి, ఆరూరు గ్రామంలోని ఎల్లమ్మ లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీహరికోట మణెయ్య, నవనీతమ్మ దంపతులు ఉభయకర్తులగా వ్యవహరించారు.

దక్కిలిలో..

దక్కిలి: దేవునివెల్లంపల్లిలోని స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో తొలి రోజు స్వర్ణాలనుకృతలో అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

రాపూరు: పెంచలకోనలోని ఆదిలక్ష్మీదేవి ఆదిలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేపినాపి సమీపంలో వెలసియున్న అంకమ్మతల్లి అంకాళమ్మ అలంకణలో భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కన్యకాపరమేశ్వరి అలంకరణలో దర్శనిమిచ్చారు.



సూళ్లూరుపేట: కలశ పూజ



పెంచలకోన ఆదిలక్ష్మీదేవికి ప్రాకారోత్సవం



సైదాపురం: ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



చిల్లకూరు: బాలాత్రిపుర సుందరిదేవిగా..



చిల్లకూరు: రాజరాజేశ్వరి అలంకరణలో ముత్యాలమ్మ..



నాయుడుపేట: పార్వతీదేవిగా పోలేరమ్మ



నాయుడుపేట: బాలాత్రిపుర సుందరిదేవిగా..



పెంచలకోన: ఆదిలక్ష్మి అలంకరణలో ..



దక్కిలి: పార్వతీదేవి అలంకరణలో..



చిట్టమూరు: లలితాదేవి అలంకరణలో..

హాకీ క్రీడాకారులకు భరోసా



క్రీడాకారులతో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఆదివారం రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన హాకీ క్రీడాకారులు చెన్నైలోని మేజర్ రాధాకృష్ణ స్టేడియంలో జరగనున్న సౌత్‌జోన్ సబ్ జూనియర్ మెన్ అండ్ ఉమెన్ ఇంటర్నేషనల్ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ప్రాక్టీస్ చేశారు. స్టేడియంలో వాకింగ్ చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్ రావు ఈ విషయం తెలుసుకుని హాకీ క్రీడాకారుల వద్ద వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేయడంతోపాటు చెన్నై మహానగరంలో ఎలాంటి అవసరం ఉన్నా తాను ఉన్నానని భరోసా ఇచ్చారు. అనంతరం హాకీ జట్టు క్రీడాకారులకు ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు.

చెంగాళమ్మకు దసరా సారె



చెంగాళమ్మకు సారెను తీసుకొస్తున్న గ్రామస్తులు

- గొల్లలములువు గ్రామం నుంచి అమ్మవారి తొలి సారె సమర్పణ

తడ: సూళ్లూరుపేట చెంగాళమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆదివారం అమ్మవారికి పుట్టినిల్లుగా భావించే తడ మండలం, కొండూరు పంచాయతీ, గొల్లలములువు గ్రామం నుంచి గ్రామస్తులు ఆనవాయితీ ప్రకారం తొలి సారెను సమర్పించారు. గ్రామంలోని వేనాటి కుమారస్వామిరెడ్డి ఇంటి నుంచి పుట్టింటి సారె తీసుకొచ్చిన తరువాత పట్టణంలోని మిగిలిన ప్రాంతాల నుంచి సారెలు అమ్మవారికి అందుతాయి. అందులో భాగంగా తొలిసారెను గ్రామస్తులు అంతా కలిసి వారివారి శక్తి మేరకు అమ్మణ్ణి కోసం తెచ్చుకున్న పూజాసామగ్రిని ఒక్కచోట చేర్చి పూజలు నిర్వహించారు. అనంతరం తప్పెట్లు, డాన్సులు, వీర జాటీలు వేసుకుంటూ నృత్యాలు చేస్తూ, సారెలను తలలపై పెట్టుకుని రెండు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ అమ్మవారి ఆలయం చేరుకుని సారెను చెంగాళమ్మకు సమర్పించారు.

అబ్దుల్ కలాంకు నివాళి



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సభ్యులు

సూళ్లూరుపేట రూరల్: డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి, ప్రపంచ విద్యార్థి దినోత్సవ వేడుకలను సూళ్లూరుపేట పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన పాఠశాలలో అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలాం ఉత్సవ కమిటీ నిర్వాహకులు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి కలాం పురస్కారాల పేరుతో ప్రశంశాపత్రాలతోపాటు బహుమతులు అందజేశారు. ఇస్రో రిటైర్డ్ అధికారి రవింద్రనాథ్, తడ ఏఎస్‌ఐ శ్రీకుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఉస్మాన్ బాషా, సురేష్, భాను, ఉపాధ్యాయులు రఘురాం, దీపిక, జయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు మర్లపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష

సైదాపురం: మర్లపూడి గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన

కోట: స్థానిక కోటమ్మ దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం షిరిడీ సాయిఅక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు యరటపల్లి మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. వెంకటేశ్వర అరవింద్ ఐ హాస్పిటల్ తిరుపతి నుంచి విచ్చేసిన నిపుణులైన డాక్టర్లు కంటి పరీక్షలు నిర్వహించారు. 302 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన 30 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, అల్లం రమణయ్య, సురేష్‌రెడ్డి, గిరిరెడ్డి, కోటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కండలేరులో 11.593 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 11.593 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 30 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు



నాయుడుపేట జాతీయ రహదారిలో హెచ్చరిక బోర్డులు

నాయుడుపేట: నాయుడుపేట పట్టణ పరిధిలోని చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై పలు కూడళ్ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండడంపై స్థానిక ప్రజాప్రతినిధులు ద్వారా తెలుసుకున్న తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి వెంటనే జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌తో మాట్లాడారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీ ఎన్‌హెచ్ అధికారులకు సూచించారు. దీంతో స్పందించిన ఎన్‌హెచ్ అధికారులు నాయుడుపేట పట్టణ పరిధిలోని అన్నమేడు క్రాస్‌రోడ్డు, నరసారెడ్డి కండ్రిగ, చంద్రబాబు కాలనీ, మల్లాం జాతీయ రహదారి కూడలి ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సమస్యపై సత్వరమే స్పందించిన ఎంపీ గురుమూర్తికి నాయుడుపేట ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

జెండా ఉత్సవంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు



సనత్‌నగర్ గిరిజన కాలనీలో విప్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరురూరల్: పట్టణంలో శనివారం రాత్రి జరిగిన ఆంజనేయస్వామి జెండా మహోత్సవంలో గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పలు ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి జెండా ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2024 ఎన్నికల్లో గూడూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీ సాధించి మరలా సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలని ఆంజనేయస్వామిని వేడుకున్నట్లు తెలిపారు. ముందుగా ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పట్టణంలోని అరుంధతీయపాళెం, అలఘనాథస్వామి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి జెండాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ సనత్‌నగర్‌లోని గిరిజన కాలనీ వద్ద ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి జెండా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అరుంధతీయపాళెంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

ప్రణవానంద స్వామిజీచే నగర సంకీర్తన



నగర సంకీర్తనలో పాల్గొన్న ప్రణవానంద స్వామిజీ

వాకాడు: నెల్లూరు జిల్లాలోని మడమనూరు గీతా ఆశ్రమానికి చెందిన ప్రణవానంద స్వామిజీ ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాకాడు మండలం గద్దలమిట్ట గ్రామంలో హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా నగర సంకీర్తన చేశారు. ఆయన గిరిజన కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి శ్రీరామ.. జయరామ.. జయజయరామ నామాన్ని ఆలపించారు. అలాగే ఇంటింటిలోని కుటుంబసభ్యులను ఆయన దీవించి హిందూ ధర్మం విశిష్టతను తెలియజేశారు.

చురుగ్గా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు



సాగుతున్న నిర్మాణ పనులు

నాయుడుపేటటౌన్: పట్టణంలో శిథిలావస్థకు చేరుకున్న నేదరుమల్లి జనార్దన్‌రెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆదివారం కాంప్లెక్స్ దుకాణాలకు సంబంధించి స్లాబ్‌లు వేస్తుండడంతో కమిషనర్ శ్రీనివాసరావుతోపాటు స్థానిక ఇంజినీరింగ్ విభాగ సిబ్బంది దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. ఎన్‌జేఆర్ దుకాణాల సముదాయంలో మొత్తం 30 దుకాణాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో పూర్తిగా పడగొట్టి నూతన దుకాణ సముదాయం నిర్మాణానికి చర్యలు చేపట్టారు. మొత్తం 30 దుకాణాలను పూర్తిగా పడగొట్టి తిరిగి పెద్దవిగా చేస్తూ 29 దుకాణాలను నిర్మించి స్లాబ్ లెవల్ వరకు పూర్తి చేశారు. కొత్తగా నిర్మాణం జరుగుతున్న దుకాణాల సముదాయాన్ని అందంగా తీర్చిదిద్ది త్వరలో లీజుదారులకు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఈ సందర్భంగా వెల్లడించారు.